క్లుప్తంగా

వేడుకగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మకు పూజలు చేస్తున్న సంఘం ప్రతినిధులు

తగరపువలస: విశ్వకర్మ జయంతిని స్థానిక శ్రీవిశ్వకర్మ కార్పెంటర్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో భీమిలి రోడ్డులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి అష్టోత్తర శతనామావళితో అర్చించారు. అనంతరం గాయత్రీ హోమం నిర్వహించారు. కార్పెంటర్ల కుటుంబాలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోసూరు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు జగుపల్లి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎడ్లపల్లి రాంబాబు, చైర్మన్ కనిమెల్ల శ్రీను, కోశాధికారి రాము పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

మధురవాడ: మధురవాడ గాయత్రి కళాశాల సమీపంలో ఉన్న విశ్వకర్మ ఆలయంలో నిర్వహిస్తున్న జయంత్యుత్సవాల్లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎంపీ శ్రీభరత్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్ మొల్లి హేమలత, నిర్వాహకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గీతంలో రోగుల భద్రతా వారోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న గీతం వైద్యులు

కొమ్మాది: గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చెస్ (జిమ్సర్) ఆధ్వర్యంలో రోగుల భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. జిమ్సర్ ప్రో వీసీ డా. బి. గీతాంజలి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిని నిర్దేశిత భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కళాశాల డీన్ డా.ఎస్వీ రావు, సూపరింటెండెంట్ డా.వసంత కుమార్ పాల్గొన్నారు.

బిస్కెట్ ప్యాకెట్లతో అమ్మవారికి అలంకరణ



ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం 9 రకాల బిస్కెట్ ప్యాకెట్లతో అలంకరించారు. ఇదే గ్రామానికి చెందిన పిన్నింటి మేఘ హర్షిణి రెడ్డి సహాయ సహకారాలతో ఈ అలంకరణ చేశారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

రాష్ట్ర పద్మశాలి సంఘం కో-కన్వీనర్‌గా రమేష్



కొప్పల రమేష్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర పద్మశాలి నాయకులు

తగరపువలస: రాష్ట్ర పద్మశాలి సంఘం కో-కన్వీనర్‌గా భీమిలికి చెందిన కొప్పల రమేష్ నియమితులయ్యారు. తిరుపతి పద్మశాలీ భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఈ సందర్భంగా రమేష్‌ను జాతీయ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ప్రధాన కార్యదర్శులు గెడ్డం జగన్నాథం, వాసపల్లి వెంకటరావు, కార్యదర్శి వడ్డే నరసింహులు, రాష్ట్ర కన్వీనర్ జీవీ నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు బల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలనతో సరి

- ముందుకు సాగని కొత్త లైట్ హౌస్ నిర్మాణం
- పాతది కాంతి విహీనం
- సముద్రంలో అంతంతమాత్రంగా వెలుగులు
- మత్స్యకారుల అవస్థలు



ప్రస్తుతం బీచ్ వద్దనున్న లైట్‌హౌస్



కొత్త లైట్‌హౌస్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలో కొత్త లైట్‌హౌస్ నిర్మాణం ముందుకు సాగడం లేదు. అధికారులు వచ్చి స్థల పరిశీలన చేసి, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పడంతో ఆనందపడిన మత్స్యకారులు, అనంతర కాలంలో అడుగు ముందుకు పడకపోవడంతో డీలా పడ్డారు. సముద్రంలో వెలుగుల కోసం ఇంకెన్నాళ్లో ఈ నిరీక్షణ అంటూ నిట్టూరుస్తున్నారు.

బ్రిటిషర్ల కాలంలో నిర్మాణం

బ్రిటిష్‌వారు ఇక్కడ ఉన్న సమయంలో సముద్రంలో పోర్టును ఏర్పాటు చేసుకోవడం ద్వారా పలు వస్తువులు, సామగ్రిని ఎగుమతి, దిగుమతులు చేసుకునేవారు. ఇందుకోసం ఇక్కడికి వచ్చి వెళ్లే ఓడలకు దిక్సూచిగా ఉండేందుకు 1854లో బీచ్ వద్ద లైట్‌హౌస్ ఏర్పాటు చేశారు. దాంతోపాటు దగ్గరలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పోర్టు షిప్పింగ్ కార్యాలయం, బీచ్‌కు సమీపంలో లైట్‌హౌస్ నిర్వహణను చూసుకునే సిబ్బంది క్వార్టర్లను నిర్మించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వీటి బాధ్యతలు కాకినాడ పోర్టు ఆధీనంలోకి వెళ్లాయి. పోర్టు కార్యాలయంలో ఒక పోర్టు కన్జర్వేటర్, ఇద్దరు సిబ్బంది ఉండేవారు. వారు లైట్‌హౌస్ నిర్వహణ చూసేవారు. అయితే సిబ్బంది క్వార్టర్స్‌లో ఎవరూ లేకపోవడంతో క్రమేణా అది శిథిలమైపోయింది. సుమారు పది సంవత్సరాల క్రితం కాకినాడ పోర్టు ఆధీనంలో ఉన్న ఈ లైట్‌హౌస్ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖకు చెందిన షిప్స్ అండ్ లైట్‌హౌసెస్ విభాగం ఆధీనంలోకి వెళ్లడంతో, ఇప్పుడు వారి పర్యవేక్షణలో ఉంది. ఐదు సంవత్సరాల క్రితం పోర్టు కార్యాలయం మూతపడింది.

ప్రస్తుతం కాంతివిహీనం

ఇక్కడ ఉన్న లైట్‌హౌస్ తీరప్రాంత మత్స్యకారులను దిక్సూచిగా ఉపయోగపడేది. ప్రతిరోజు లైట్ హౌస్ పర్యవేక్షకుడు సాయంత్రం చీకటి పడిన తరువాత దీన్ని వెలిగించి, ఉదయం ఆర్పేస్తారు. దీనివల్ల భీమిలితో పాటు చుట్టుపక్కల చిప్పాడ, అన్నవరం, చేపలుప్పాడ, మంగమారిపేటతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లి వచ్చే మత్స్యకారులకు ఇది ఎంతగానో ఉపయోగపడేది. ఎనిమిది సంవత్సరాలుగా ఈ లైట్‌హౌస్ దెబ్బ తినడంతో పాటు కాంతివిహీనంగా మారడంతో, మత్స్యకారులకు వెలుగు సరిగ్గా కనపడక, తీరానికి చేరుకోవడం ఇబ్బందికరంగా ఉంటోంది.

స్థల పరిశీలన : ప్రస్తుత లైట్‌హౌస్ స్థానంలో కొత్త లైట్ హౌస్ ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి మూడు సంవత్సరాల క్రితం అధికారులు వచ్చి పరిశీలన చేశారు. తీరంలో వంద అడుగుల ఎత్తున భారీ లైట్‌హౌస్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. కాగా, ఇటీవల ఎన్నికలకు ముందు వచ్చిన అధికారులు ప్రస్తుత లైట్ హౌస్ ఉన్న చోటుకు దగ్గరలో, అప్పటి లైట్‌హౌస్ సిబ్బంది ఉన్న క్వార్టర్స్ ప్రాంతం అనుకూలంగా ఉందని దాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ వంద అడుగుల ఎత్తున పెద్ద లైట్‌హౌస్‌ను నిర్మించాలని, దాని చుట్టు పార్కు కూడా నిర్మిస్తే సందర్శకులు చూసి వెళ్లడానికి బాగుంటుందని భావించారు. ఎన్నికల అనంతరం నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. దీంతో మత్స్యకారులు తమకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆనందపడ్డారు. అయితే, ఎన్నికలై నాలుగు నెలలు కావస్తున్నా లైట్ హౌస్ నిర్మాణానికి సంబంధించి ఎటువంటి సమాచారం లేకపోవడంతో మత్స్యకారులు నిరాశ చెందుతున్నారు. త్వరితగతిన కొత్త లైట్‌హౌస్ నిర్మించాలని కోరుతున్నారు.

చాలా సమస్యగా ఉంది



గతంలో లైట్‌హౌస్ బాగా పని చేసినప్పుడు ఆ కాంతి చాలా దూరం కనబడేది. మా పడవలను తీరానికి తీసుకురావడానికి ఎంతో సదుపాయంగా ఉండేది. కానీ, చాలా సంవత్సరాలుగా ఇది సరిగ్గా పనిచేయకపోవడంతో చీకట్లో పడవలు, తెప్పలు తీరానికి రావడానికి చాలా సమస్యగా ఉంది.

– వాసుపల్లి రాజు, మత్స్యకారుడు, భీమిలి

జాప్యం చేయకుండా నిర్మించాలి



తీరంలో కొత్త లైట్‌హౌస్ నిర్మిస్తారని చెప్పడంతో చాలా ఆనందపడ్డాం. అది పూర్తయితే చేపలవేటకు మరి కొంత దూరం సముద్రంలోకి వెళ్లి రావడానికి బాగుంటుందని ఆశపడ్డాం. అధికారులు మా సమస్య గుర్తించాలి. జాప్యం చేయకుండా వెంటనే నిర్మాణం చేపట్టాలి.

– సురివిన వీర్రాజు, మత్స్యకారుడు, భీమిలి

వుడా కాలనీలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దుకాణం

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులోని ఓ ఫాస్ట్‌ఫుడ్ దుకాణం అగ్నికి ఆహుతైంది. మంగళవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో వంట చేస్తున్న క్రమంలో నూనె మరుగుతున్న పెనంలోకి మంటలు వచ్చాయి. వీటిని ఆర్పే క్రమంలో పెనంలో ఉన్న నూనెలో నీరు పడడంతో మంటలు మరింత పెరిగి, దుకాణం అంతా వ్యాపించాయి. స్థానికులు సమయస్ఫూర్తితో వ్యవహరించి, గ్యాస్ సిలిండర్‌ని తప్పించి తీసేయడంతో పెనుప్రమాదం తప్పింది. చుట్టుపక్కల వ్యాపారులు సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో, ఇతర దుకాణాలకు మంటలు వ్యాపించకుండా కట్టడి చేయగలిగారు. బొబ్బిలి నుంచి బతుకు తెరువు కోసం వచ్చిన బత్తిన బలరాం కుటుంబసభ్యులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. ప్రమాదంలో 2 సెల్ ఫోన్లు, ఫ్రిజ్, వంటపాత్రలు, భద్రపరచుకున్న వంట సామగ్రి సహా కమ్మల పాక మొత్తం కాలిపోవడంతో కుటుంబం రోడ్డున పడింది. పీఎంపాలెం పోలీసులు శ్రీకాంత్, ట్రాఫిక్ ఏఎస్ఐ, ఇతర సిబంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

కార్మికులకు బీమా ప్రీమియం చెల్లింపు



మాట్లాడుతున్న వాయునందనరావు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో భవన నిర్మాణ కార్మికులకు బీమా ప్రీమియం తాము చెల్లిస్తామని విశాఖ పార్లమెంట్ జిల్లా ధార్మికశాఖ కన్వీనర్ సత్తరపు వాయునందనరావు తెలిపారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా భీమిలి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు తమను కలిస్తే బీమా ప్రీమియం సొమ్ము చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కో-కన్వీనర్ పల్లా భరత్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు పాల్గొన్నారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్.. జాతీయ రహదారిపై స్టాపర్ల ఏర్పాటు



వెంకటేశ్వరమెట్ట జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన స్టాపర్లు

తగరపువలస: ఎట్టకేలకు జాతీయ రహదారిపై వెంకటేశ్వరమెట్ట వద్ద భీమిలి ట్రాఫిక్ పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారు. 'ప్రమాదమని తెలిసినా..' శీర్షికతో ఈ నెల 14న సాక్షిలో ప్రచురించిన కథనానికి వారు స్పందించారు. ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు స్టాపర్లు ఏర్పాటు చేశారు. దీంతో జాతీయ రహదారిపై వేచి ఉండే ప్రయాణికులకు రక్షణగా ఇవి ఉపయోగపడుతున్నాయని, ఈ ప్రాంతంలో వాహనాలు నెమ్మదిస్తున్నాయని ప్రయాణికులు తెలిపారు.

నాగ వంశీయుల సంక్షేమానికి కృషి



అప్పలనాయుడు దంపతులను సత్కరిస్తున్న నాయకులు

మధురవాడ: నాగ వంశీయుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాగవంశం విభాగం అధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు అన్నారు. మధురవాడలోని ఆయన స్వగృహంలో నాగవంశీయ ప్రముఖులు మంగళవారం ఆయన్ను కలిసి, సన్మానించారు. ఉమ్మడి రాష్ట్ర నాగవంశం సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామభక్త కన్నారావు, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, బోని జెడ్పీటీసీ బోని పార్వతి, కృష్ణాపురం మాజీ సర్పంచ్ సుంకర నారాయణరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రెసిడెంట్ కనకాల కృష్ణ, కార్యదర్శి బెవర మహేష్, నాగవంశం జేఏసీ సభ్యుడు కాళ్ల అప్పల సూరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా చూసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారి సుమ

మధురవాడ: వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, రాకుండా చూసుకోవడం మేలని మధురవాడ ఆయుర్వేద హాస్పిటల్ వైద్యాధికారిణి సుమ అన్నారు. మధురవాడ సమీపంలోని గణేష్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో స్వస్థ అభియాన్‌లో భాగంగా సంపూర్ణ ఆహారం, ఆయుర్వేద వైద్యంపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మధురవాడ పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. మధురవాడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయ గణపతికి సహస్ర లడ్డూ అర్చన



పూజలందుకున్న విజయ గణపతి

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీ విజయ గణపతి పంచాయతన దేవాలయంలో స్వామికి మంగళవారం సహస్ర లడ్డూలతో అర్చన చేశారు. స్వామికి 1100 లడ్డూలను నివేదించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండ పద్మనాభ శర్మ, నవీన్ శర్మ ఆధ్వర్యంలో స్వామిని గరిక మాలలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ధర్మకర్త నక్కాన సూర్యప్రకాశరావు, కమిటీ పెద్దలు గడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అధికారులు, నాయకులు

పద్మనాభం: మండలంలోని పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హిందీ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. పండ్లు, కూరగాయలు, హిందీ కవులు తదితర అంశాలపై ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎంఈవో పి.రమణ, రెడ్డిపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు, నాయకులు తిలకించారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ భూపతిరాజు, హెచ్‌ఎం బి.అప్పలరాజు, హిందీ టీచర్ డి.చిన్నారి పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



తిరుమల విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

తగరపువలస: నులిపురుగుల కారణంగా శారీరక, మానసిక అభివృద్ధిలో మందకొడితనం కలుగుతుందని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పలు పాఠశాలల్లో చిన్నారులకు అవగాహన కల్పించారు. మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేశారు.

- తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో నులిపురుగుల వల్ల అనర్థాలపై ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. మొత్తం 1300 మంది విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎచ్చెర్ల హరి, ఆశ వర్కర్ జిల్లెళ్ల దేవి, ఏఎన్‌ఎం మాదాబత్తుల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే సేవ

వాడవాడలా పరిశుభ్రత కార్యక్రమాలు



వెల్లంకిలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ ప్రజలు



తాళ్లవలసలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో జానకి



పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, మహిళలు



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం తాళ్లవలసలో ఎంపీడీవో వి.జానకి ఆధ్వర్యంలో మంగళవారం పరిశుభ్రతా కార్యక్రమాలు, ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు, ఆస్పత్రుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోరాడ రమణ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఏఈ రాజేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- ఆనందపురం మండలం శొంఠ్యాం ఎస్ఎస్ఆర్ఐటీలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంభుప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.
- వెల్లంకి పంచాయతీలో ఆనందపురం ఎంపీడీవో లవరాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ తదితరులు పారిశుధ్య పనులు నిర్వహించారు. ఆనందపురం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభంలో ర్యాలీ

పద్మనాభం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మహిళ తమ ఇంటితో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అక్టోబర్ ఒకటి వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు, మహిళలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కుమార్, ఏపీఎం ప్రభాకర్, డీపీఎం సంజయ్‌బాబు, సీసీలు రమణ, రమణమ్మ పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో అగ్రరాజ్యాల సరసన భారత్

కొమ్మాది: శక్తివంతమైన దేశాల్లో భారత దేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం మరింత ప్రగతి సాధిస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై రాజకీయం తగదన్నారు. అనంతరం విజయవాడ వరదల్లో 11 రోజులు పాటు సేవలు అందించిన జీవీఎంసీ సిబ్బందిని ఆయన సత్కరించారు.

ఆవు దూడను రక్షించిన యువకులు



హైవే శ్లాబుల కింద ఇరుక్కుపోయిన ఆవు దూడ



ఆవుదూడను బయటకు తీస్తున్న యువకులు

మధురవాడ: మధురవాడ బస్టాప్ వద్ద హైవే సర్వీసు రోడ్డులోని శ్లాబుల కింద ఓ ఆవు దూడ సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు పడిపోయి, ఇరుక్కుపోయింది. దూడ అరుపులు విన్న స్థానిక చిల్లర వ్యాపారులు, బీజేపీ నాయకుడు ప్రదీప్ తదితరులు గమనించి ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. దీనిపై స్పందించిన మధురవాడ ధోబీ కాలనీ గల్లీ బాయిస్ సోమవారం అర్ధరాత్రి గణేష్ నిమజ్జనం అయిన అనంతరం, పలకలు తొలగించి దూడను బయటకు తీశారు. వీరిని పలువురు అభినందించారు.

కస్తూర్బా విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



కస్తూర్బా విద్యార్థినులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

పద్మనాభం: బాలికలు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, దానిని చేరుకునే విధంగా విద్యనభ్యసించాలని భీమునిపట్నం ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, మండల బీజేపీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా సమకూర్చిన నోట్ పుస్తకాలు, పండ్లు, స్వీట్లను కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయ విద్యార్థినులకు ఆయన పంపిణీ చేశారు. తహసీల్దార్ ఎం.ఆనంద్ కుమార్, బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవి కుమార్, ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ, బీజేపీ నాయకులు ఆర్.శ్రీనివాసరావు, పి.కృష్ణారావు, హెచ్.మహేష్ పాల్గొన్నారు.

బసవేశ్వరునికి 108 రకాల పుష్పాలు, ఫలాలతో పూజలు





ప్రత్యేక అలంకరణలో బసవేశ్వరుడు, అర్చనకు సిద్ధం చేసిన ఫలాలు, పుష్పాలు, మూలికలు, సుగంధద్రవ్యాలు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం దిబ్బీస్ నుంచి అమనాం రహదారిలోని బసవేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ శివయ్య ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 108 రకాల పుష్పాలు, 108 రకాల పండ్లు, పంచామృతాలు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, వనమూలికలతో స్వామికి అభిషేకం చేశారు. కన్నులపండువగా జరిగిన ఈ కార్యక్రమాన్ని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు తిలకించారు.

గంగ ఒడికి గౌరీసుతుడు

భీమిలి బీచ్‌లో ప్రశాంతంగా నిమజ్జనాలు



నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తీసుకువెళ్తున్న భక్తులు

భీమునిపట్నం: నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. భీమిలి బీచ్‌వద్ద సోమవారం అర్ధరాత్రి వరకు వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఉత్సాహంగా జరిగాయి. భీమిలి నియోజకవర్గ పరిధితో పాటు, విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గణేశుని విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి తీరంలో నిమజ్జనం చేశారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనాలు జరిగే ప్రాంతంలో బారికేడ్లు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఇసుకలో కొద్ది దూరం వరకు మాత్రమే భక్తులు విగ్రహాలను మోసుకు వెళ్లే అవకాశం కల్పించగా, అక్కడి నుంచి గత ఈతగాళ్లు వాటిని తీసుకుని నీటిలోకి వెళ్లి నిమజ్జనాలు చేశారు. భక్తులు నీటి వద్దకు వెళ్లడానికి పోలీసులు అనుమతించలేదు. మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేయడం, అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు



రేవళ్లపాలెంలో ఆకట్టుకున్న దీపాలంకరణ

భీమునిపట్నం: వినాయక ఉత్సవాల్లో భాగంగా కృష్ణాకాలనీ వద్ద కేపీ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండపం వద్ద మంగళవారం కుంకుమ పూజలు నిర్వహించారు.



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

మధురవాడ: 6వ వార్డు రేవళ్లపాలెంలో వినాయక మండపం వద్ద దీపారాధన చేశారు. ఇక్కడ నృసింహ స్వామి నమూనాలో ఏర్పాటు చేసిన విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది.